దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తా: కొప్పుల



కాలనీలోని సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్, శ్రీకృష్ణానగర్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ సరస్వతీనగర్‌లో డ్రైనేజీ లైన్ అనంతరం సీసీ రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేయిస్తామన్నారు. అదేవిధంగా శ్రీకృష్ణనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ లేని చోట్ల వేయించి స్ట్రీట్‌లైట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లను సైతం త్వరలోనే వేయిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

సర్వే నం.201/1లో రిజిస్ట్రేషన్లు పునరుద్ధరణ



డీఎఫ్ఓను సన్మానిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సర్వే నం.201/1లో రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించడం హర్షనీయమని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడి అన్నారు. మంగళవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి డీఎఫ్ఓ సుధాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సాహెబ్‌నగర్ కలాన్‌లో సర్వే నం.201/1లో కొంత కాలంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కాలనీవాసులతో కలిసి జిల్లా ఫారెస్ట్ అధికారి సుధాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించిన డీఎఫ్ఓ స్థానిక సబ్‌రిజిస్ట్రార్‌కు ఎన్ఓసీ సర్టిఫికెట్‌ను జారీ చెయడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రఘురాం నేత, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



వరదనీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో చేపడుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను మంగళవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉషాకిరణ్‌కు మహిళా సాధికారత అవార్డు



ఉషాకిరణ్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న సినీహీరో సుమన్

చంపాపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లబాయ్ ఉషాకిరణ్‌కు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సినీ హీరో సుమన్ చేతుల మీదుగా మహిళా సాధికారత అవార్డును అందజేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యామిని స్టూడియోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా, సంక్షేమం, సమాజం, రాజకీయ రంగాలలో కృషి చేసినందుకుగాను ఉషాకిరణ్‌కు మహిళా సాధికారత అవార్డు-2025ను అందజేశారు. ఈ సందర్భంగా ఉషాకిరణ్ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

సైదాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో డివిజన్‌లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పూసలబస్తీలో పర్యటించి తాగునీటి సమస్యలను పరిశీలించారు. కొంతకాలంగా బస్తీలో నల్లాలలో లోప్రెషర్‌తో పాటు కలుషిత నీరు వస్తుందని బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సత్వరమే సమస్య పరిష్కరించాలని జలమండలి మేనేజర్ శ్రవణ్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు భానప్రకాశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

చాదర్‌ఘాట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో వచ్చేనెల ఏప్రిల్ 6న జరగనున్న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ కార్గో సేవా విభాగం ఆధ్వర్యంలో ఇంటి వద్దకే రాములోరి కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేయనున్నట్లు ఏటీఎం సి.రవీందర్ తెలిపారు. ఆర్టీసీ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోని కార్గో పార్శిల్ బుకింగ్ కౌంటర్ ఆధ్వర్యంలో కల్యాణ తలంబ్రాలు బుకింగ్‌ను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. సీతారాముల కల్యాణం జరిగిన తర్వాత ముత్యాలతో కూడిన తలంబ్రాలను అడ్వాన్స్‌గా బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాల కోసం ఎంజీబీఎస్ లాజిస్టిక్స్ ఇన్‌చార్జిని ఫోన్ నం.9154298741, 9154298865ల ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.


23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభ

సరూర్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాట యోధులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభ ఈ నెల 23న నిర్వహించనున్నట్లు పీవైఎల్ (ప్రోగ్రెసివ్ యూత్ లీగ్) బాలాపూర్ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరు భీమేశ్, కారమోల రాకేశ్ తెలిపారు. వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో పీవైఎల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ ప్రతినిధులు నరేందర్, శంకర్, రాంచందర్, సందీప్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరీయల్ పంపిణీ

వనస్థలిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్ ఎడ్యూకేషన్ ఫౌండేషన్ చైర్మన్ ఐనాల వినయ్ పటేల్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ మెటీరీయల్స్ పంపిణీ చేశారు. రాబోయే పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్యను అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ దూదిపాల శివకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మణిచందన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు దినేష్, కళ్యాణ్ రాజ్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



అంజమ్మ

సంతోష్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ డీఎస్ నగర్‌లో డి.రాజు, రమణ దంపతులు నివాసం ఉంటున్నారు. రమణ తల్లి ఇ.అంజమ్మ(60) వారితోనే ఉంటుంది. అంజమ్మ ఈ నెల 5న మద్యం తెచ్చుకునేందుకు చంపాపేటకు వెళ్లొస్తానని తన కుమార్తె రమణకు చెప్పి డబ్బులు తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

టెన్త్‌లో సత్తాచాటేందుకు విద్యార్థులు సిద్ధం

- ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ స్కూళ్లలో బోధన
- ఈ నెల 21 నుంచి పరీక్షలు
- చంపాపేట, కర్మన్‌ఘాట్‌లలో హాల్ టికెట్‌ల అందజేత



చంపాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

చంపాపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని చంపాపేట, కర్మన్‌ఘాట్‌లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఈ విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన అందించారు. చంపాపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 136 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో తెలుగు మీడియంలో 41మంది, ఇంగ్లిష్ మీడియంలో 95మంది చదువుకుంటున్నారు. అదే విధంగా కర్మన్‌ఘాట్‌లోని ఉన్నత పాఠశాలలో 129మంది విద్యార్థులు ఉండగా తెలుగు మీడియం 85మంది, ఇంగ్లిష్ మీడియం 44మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా హెచ్ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

రెండు సంవత్సరాల నుంచి..

చంపాపేట, కర్మన్‌ఘాట్‌లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు గత రెండేండ్లలో టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించ లేక పోయారు. ఈసారి రెండు పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా చక్కని బోధన అందించారు. మంగళవారం చంపాపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హాల్‌టికెట్లను అందించి హెచ్ఎం, టీచర్లు వారికి ఆల్‌ది బెస్ట్ చెప్పి ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు.

హయత్‌నగర్‌లో 20 సెంటర్‌లలో..

హయత్‌నగర్: హయత్‌నగర్ మండల విద్యాశాఖ పరిధిలో 20 సెంటర్‌లలో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5,210మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. సమయానికి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

ఈ నెల 21నుంచి పరీక్షలు

ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వరకు కొనసాగనున్న టెన్త్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయ 9:30గంటల నుంచి మధ్యాన్నం 12:30గంటల వరకు ఆయా సెంటర్లలో పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న థర్డ్ లాంగ్వేజ్, 26న గణితం, 28న సైన్స్ పార్టు-1, 29న సైన్స్ పార్టు-2 ఏప్రిల్ 2న సాంఘీకశాస్త్రం, 3న మేయిన్ లాంగ్వేజ్ పేపర్-1, 4న మేయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నారు.

మంచి మార్కులు సాధిస్తాం



ఈ విద్యాసంవత్సరం టెన్త్‌లో మంచి మార్కులు సాధిస్తాం. గతంలో కంటే ఈసారి మంచి ఫలితాలు సాధించి మా పాఠశాలకు మంచిపేరు వచ్చే విధంగా కృషి చేస్తాం.

-కె.ఇందు, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, చంపాపేట

నూటికి నూరుశాతం సాధిస్తాం



ఉపాధ్యాయులు చక్కగా అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించారు. టెన్త్‌లో నూటికి నూరు శాతం మార్కులు సాధిస్తాం. ప్రత్యేక తరగతులు మాకు ఎంతో ఉపయోగ పడ్డాయి.

- ఏ.కిరణ్, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, చంపాపేట

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు



పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు తీసుకున్నాం. వారికి ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించాం. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నాం.

-విజయ, జీహెచ్ఎం, చంపాపేట, జడ్పీహెచ్ఎస్

బీసీల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి : శ్రీనివాస్



రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, షకీల్, తదితరులు

చాదర్‌ఘాట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని పెట్టి ఆమోదించిన నేపథ్యంలో ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు మంగళవారం మలక్‌పేటలోని సలీంనగర్ చౌరస్తాలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఆమోదం పొందేలా చేపట్టిన చర్యలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్‌సింగ్, సాయిరాం, డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, షకీల్, రాహుల్‌సింగ్, చక్రపాణి, నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదం పట్ల హర్షం

కొత్తపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బీసీ బిల్లును ఆమోదింపజేయడం హర్షణీయమని బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనంజయ నాయుడు అన్నారు. మంగళవారం న్యూ నాగోల్‌లోని ఎస్‌ఏ డాంగే భవన్‌లో సమితి నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్లమెంటులోనూ బీసీ బిల్లు ఆమోదం పొందేలా సీఎం వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులనూ ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం: రాజిరెడ్డి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజిరెడ్డి

చాదర్‌ఘాట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను గత కేసీఆర్ ప్రభుత్వం తరహాలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో ముందు టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుయూ డిపో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా మేనిఫెస్టోలో పెట్టిన మేరకు కార్మిక సంఘాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తి చేయాలని, అపాయింటెడ్ డే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 2017 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు రిటైర్డ్ అయిన వారికి ఎరియర్స్ డబ్బులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాల ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని, కన్సాలిడెటెడ్‌పై పనిచేస్తున్న వారందరిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2019 సమ్మె కాలంలో పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేయాలని, 2017 వేతన సవరణకు సంబంధించి అలవెన్స్‌లను పెంచాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఎస్‌డబ్ల్యుయూ డిపో కమిటీ కార్యదర్శి మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మనోహర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కేటీ రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్ రాజ్, ఉస్మాన్, ఎస్ఎంరెడ్డి, సీహెచ్ అబ్బాస్, శ్రీలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామివారి రథోత్సవం

ఎల్‌బీనగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి రథోత్సవం పురవీధులలో కనుల పండువగా సాగింది. ఈ రథోత్సవంలో దేవాదాయ శాఖ అధికారి ఉమారాణి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ జగిని రమేష్, తలాటి రమేష్‌నేత, బొడ్డుపల్లి మహేందర్, సాయికుమార్, రాజు శ్రీవాత్సవ, లింగస్వామి, మంచుకొండ శ్రీనివాస్, ప్రశాంత్, శ్యామ్ సుందర్, విజయ్ భారత్, హరీష్ కుమార్, భగత్, మల్లేష్, ఉమామహేశ్వరి, విజయలక్ష్మీ, నీలిమ, రాధ, విద్యారెడ్డి, జయంతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి : శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నీరంకి రవి, శ్రీకాంత్, వజీర్‌కుమార్, తదితరులు

ఎల్‌బీనగర్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి అర్బన్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టి కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మంగళవారం పలువురు నేతలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పూర్వవైభానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ అధికార ప్రతినిధి నీరంకి రవి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు జొర్రిగల శ్రీకాంత్, వజీర్ కుమార్‌గౌడ్, కృష్ణప్రకాష్, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

వనస్థలిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి నియమించడం హర్షనీయమని బీజేపీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కొంతం నవకిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డిని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని ఆయన నివాసానికి నవకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకుని పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి, ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి



డీసీపీ ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్ మంగళవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. గిరిజన మహిళ వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ, తీవ్ర పదజాలంతో దూషించిన సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. వెంటనే అరెస్ట్ చేయకపోతే ఆందోళనలకు దిగుతామని ఆమె హెచ్చరించారు. ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపడతానన్నారు. అనంతరం ఆమె డీసీపీ కార్యాలయం వద్ద మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మహిళలు సమాజంలో తిరగవద్దా? రాజకీయాల్లోకి వస్తే ఇలా అవమానంతో హేళన చేస్తారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తనను, తన కుటుంబాన్ని తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందన్నారు. వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్, శశిధర్‌రెడ్డి, లింగాల కిషోర్‌గౌడ్, శ్రీపాల్ రెడ్డి, నర్సింహయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి వెంకటేష్‌గౌడ్, రమేష్‌రెడ్డి తదితరులు సుజాతనాయక్‌తో కలిసి డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను కలిశారు.

'దాడులతో నర్సింహారెడ్డి దిగజారుడు రాజకీయాలు'

మన్సూరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన తమపై సోమవారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన అనుచరులు, రౌడీలు, చిల్లర బ్యాచ్‌తో వచ్చి దాడులకు పాల్పడటం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఎల్బీనగర్ బీఆర్ఎస్ పార్టీ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి విమర్శించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని తన నివాసం వద్ద బీఆర్ఎస్ నేతలతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల్లో తమ పదవి పోతుందని తెలిసి కొందరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. మధుయాష్కీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని కొందరు బీజేపీ కార్పొరేటర్లు పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై బీజేపీ అధిష్ఠానం దృష్టిసారించాలని సూచించారు. ఇకనైనా నర్సింహారెడ్డి కుటిల రాజకీయాలు మానుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్‌కుమార్, రమాచారి, అఖిల్‌యాదవ్, నర్రి లింగం, సాయిగౌడ్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

హయత్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లోని కాశంగుట్టపై నిర్మిస్తున్న రేణుకాఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 5లక్షలా 116లను ప్రముఖ వ్యాపారవేత్త గుర్రం చంద్రశేఖర్‌రెడ్డి విరాళంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేతరి స్వామి, చెక్క మల్లయ్య, మేతరి అశోక్, బాల్ నరసింహ, సుధాకర్, బాబు. దయానంద్, మేతరి బాబు పాల్గొన్నారు.

మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ పరిధిలోని మహమ్మాయిపురంలో శ్రీ మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 19న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఉమామహేశ్వరస్వామి కల్యాణం, రాత్రి 7 గంటలకు మహాపడి నైవేద్య నివేదన, 20వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. అదే రోజు ఉదయం 11 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు యెర్రవెల్లి మారుతి ప్రసాద్ తెలిపారు. బుధ, గురు వారాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

మన్సూరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలు రాజకీయంగా ఎదగాలని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా సూచించారు. నాగోల్ డివిజన్ శుభం కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య(ఐవీఎంఎస్) వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మీ శ్రీధర్‌గుప్తా ఆధ్వర్యంలో ఐవీఎంఎస్ దశాబ్ది ఉత్సవాలను 'ఉమెన్స్ పవర్- నేషనల్ పవర్' అనే నినాదంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీ వెంకటేష్, బొగ్గారపు దయానంద్ విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత పేరాల చంద్రశేఖర్‌రావు, టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చికోటి ప్రవీణ్‌కుమార్, సినీ నటుడు పృథ్వీ, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, ఐవీఎంఎస్ ప్రధానకార్యదర్శి కల్పన, సరిత, పద్మ, వీణ, సంతోషి, అమరజ్యోతి, అనిత, సంధ్యారాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్, తదితరులు



నిరంజన్ యాదవ్‌ను సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా నిరంజన్‌యాదవ్

సైదాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా కుర్మగూడ డివిజన్‌కు చెందిన నిరంజన్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఎన్నికల కో-రిటర్నరింగ్ ఆఫీసర్ గీతా మూర్తి ప్రకటించారు. ఈ సందర్భంగా నిరంజన్ యాదవ్ మాట్లాడుతూ పాతబస్తీలో మజ్లిస్ నేతల ఆగడాలను అడ్డుకుంటానని తెలిపారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పాతబస్తీలో అధిక డివిజన్‌లలో బీజేపీ జెండా ఎగరవేసేందుకు సమష్టి కృషి చేస్తామని చెప్పారు. నూతన అధ్యక్షుడిని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, నేతలు కొత్తకాపు రవిందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనాథ్, జనపాల మధులు కలిసి సత్కరించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మల్లేశ్‌యాదవ్



మల్లేశ్‌యాదవ్

సరూర్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి సరూర్‌నగర్ మండలంలో ఎంపీటీసీ సభ్యుడిగా పని చేసిన తర్రె మల్లేశ్‌యాదవ్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. పార్టీకి విధేయుడిగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే మల్లేశ్‌యాదవ్ సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం సోమవారం ప్రకటించిన పలు జిల్లాల అధ్యక్షుల పేర్లతో పాటు నియోజకవర్గాల వారీగా రాష్ట్ర కౌన్సిల్ సభులను సైతం ప్రకటించింది. ఈ క్రమంలో మహేశ్వరం నియోజకవర్గం నుంచి నాదర్‌గుల్‌కు చెందిన మల్లేశ్‌యాదవ్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామకం పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ తనకు పదవి అప్పగించిన పార్టీ పెద్దలకు, తనకు పదవి రావడానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అమర్నాథ్‌రెడ్డి



అమర్నాథ్ రెడ్డి

సైదాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీకి చెందిన తోట అమర్నాథ్‌రెడ్డి నియమితులయ్యారు. అమర్నాథ్‌రెడ్డి ఐఎస్‌సదన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. అతడి సేవలు గుర్తించి పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మోదీ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలిపారు.